# మార్క్సిజం - రివిజనిజం

లండన్‌నుండి వార్త. ప్రపంచవ్యాప్తంగా అన్నిదేశాలలోనూ జరిగినట్టే బ్రిటన్‌లోనూ మార్క్స్ శతవర్ధంతి జరిగింది. మార్క్స్ సమాధివద్ద బ్రిటిష్ కమ్యూనిస్టుపార్టీ ఆధ్వర్యాన ఒక వందమంది కామ్రేడ్లు గుమిగూడారు. చనిపోయిన వారికి శ్రద్ధాంజలి ఘటించేటప్పుడు వారి సమాధిదగ్గర బైబిల్‌నుండి కొన్నివాక్యాలు చదవడం క్రిశ్చియన్ల ఆచారం. ఆ ప్రకారమే బ్రిటిష్ కమ్యూనిస్టుపార్టీ నాయకు డొకడు దాసకాపిటల్‌నుండి కొన్నివాక్యాలు బిగ్గరగా చదివాడట. అక్కడ గుమి గూడిన జనమంతా అవనతవదనులై (ఇది నా ఊహామాత్రమే, వార్తలో భాగంకాదు) ఆ వాక్యాలువిని, నిశ్శబ్దంగా నిష్క్రమించారట.

ఇదీ ఇవాళ్టి వాతావరణం. చేనుకు పురుగుపడితే ఒకటిరెండు మొక్కలకు మాత్రమే పట్టక ఎకరాలకు ఎకరాలు తినేస్తుంది. అట్లాగే రివిజనిజం పురుగు అన్ని దేశాలలోనూ కమ్యూనిస్టు ఉద్యమాన్ని తినేస్తోంది. రివిజనిజంగా మారిన మార్క్సిజం దోపిడీ వర్గాలకు మచ్చికఅయింది. వాళ్ళకు మార్క్స్అంటే భయంపోయింది. అసెంబ్లీలు, పార్లమెంటులు, మార్చి 14న మార్క్స్‌ను శాస్త్రోక్తంగా స్మరించాయి. భూపేశ్‌గుప్తా లేడుగాని, బ్రతికేవుంటే ఆయనగారి సంస్మారక వాగ్ధాటికి రాజ్య సభలో కన్నీటికి తడవని కళ్ళుండేవికావు. హైదరాబాద్‌లో స్వామి రంగనాధానంద నుండి మాస్కోలో మాజీ పోలీసుఅధికారి ఆండ్రోపోవ్ వరకు, అందరూ మార్క్స్ మవాదేనన్నట్టూ, ఆయన సిద్ధాంతామృతసారాన్ని తామే కాచివడబోసినట్టూ, సందేశా లిచ్చారు. ఒకడు ఫ్యూడల్, ఒకడు సామ్రాజ్యవాది. వీళ్లిద్దరికీ మార్క్స్‌ను స్మరిం చేంత ధైర్యం వచ్చిందంటే ఆపురుగు ఎంతలోతుగా నమిలేసిందో అంచనా వేసుకోవచ్చు.

విశ్వవిద్యాలయాలలోనూ వర్ధంతిసభలు జరుగుతాయి. పి. హెచ్. డీ పట్టాల వేటలో మార్క్స్‌ను మారకపు సరుకుగా మార్చేసిన మేధావులు ఆయన గురించి వ్యాసాలు దంచుతారు. వాళ్ళకు తమ సిద్ధాంతవ్యాసాలను టైపుచేసే టైపిస్టుల ఎడమపట్ల ఏపాటి గౌరవముందో, ఆ వ్యాసాలకు సిద్ధాంతాన్ని సమకూర్చిపెట్టిన మార్క్స్ అన్నా అంతేగౌరవం వుంది. నిజానికి, 'సిద్ధాంతపరంగా విమర్శించడం, ఆచరణలో విప్లవీకరించడం' అనే రెండు కర్తవ్యాలను (to critise in theory and revolutionise in practise) విడగొట్టడం తెలీని మార్క్స్‌కు, 'మార్క్సిస్టుమేధావి' అనే మాటే బహుశా రుచించేది కాదేమో. ఆ రెండు కర్తవ్యాలనూ విడగొట్టి మొదటిదాన్ని

అకడెమిక్ హోదాల వేటకు లోబరిచారు. మార్క్సిజం నుండి విప్లవాన్ని తొలగించారు. 1913 లో లెనిన్ 'బూర్జువా సైన్సుకు మార్క్స్ భావాలంటే విపరీతమయిన విరోధం, ద్వేషం' అన్నాడు కాని, ఆలోచననూ ఆచరణనూ విడగొట్టిన తరువాత ఆ భయం పోయింది. బూర్జువా యూనివర్సిటీలలోకి మార్క్స్‌ను సాదరంగా ఆహ్వానిం వర్ధంతి సందర్భంగా సత్కరిస్తున్నారు గూడ. బూర్జువా పత్రికలు సహితం ఆ ప పడిని స్పష్టంచేస్తూ మార్క్స్ మీద సంపాదకీయాలు రాస్తున్నాయి. ఆయన చెప్ప విప్లవం అబద్ధంగాని, ఎంతటిమేధస్సు, ఎంతటి మానవీయత, ఏమాసామాజిక విశ్లేషణాతత్పరత అని కీర్తిస్తున్నాయి.

అందుకే ఇవ్వాళ మార్క్స్‌ను స్మరించుకోవాలంటే విప్లవాచరణ గురించి మాట్లాడుకోవాలి. నానారకాల రివిజనిజం మార్క్సిజం నుండి తొలగించివేసిన సజీవ విప్లవాచరణను తిరిగి తన స్థానానికి చేర్చాలి. ఆచరణ, మార్పు, ఆలోచనాపూర్వకమయిన విధ్వంసన, నిర్మాణం. వీటికి మార్క్స్ సిద్ధాంతంలోవున్న కేంద్రస్థానం ఆయన రచనలలో అడుగడుగునా కనిపిస్తుంది. సోవియట్ రివిజనిస్టుల పుణ్యాన మనం చరిత్రను అమూర్తమయిన, నిర్జీవమయిన, ఉత్పత్తిరంగంలోని వైరుధ్యాల సంఘర్షణ ఫలితంగా చెప్పుకుంటున్నాము. ఆ వైరుధ్యాలు పరిష్కారం కావాలంటే సామాజికరూప తీసుకోవాలనీ, సామాజికరూపం తీసుకోవడమంటే వర్గవైరుధ్యం రూపంతీసుకోవడమనీ, ఆ వైరుధ్యాల సంఘర్షణ వర్గసంఘర్షణ రూపం తీసుకుంటుందనీ, చెప్పడం అప్రధానమయిపోయింది. పెట్టుబడిదారీ సమాజంలో సామాజిక రూపంతీసుకున్న ఉత్పత్తి (social prodnction) వ్యక్తిస్వామ్యం (private appropriation) ఆటంకమయిందని చెప్పినంతగా, ఆ ఆటంకం, అందులో ఉన్న వైరుధ్యం, కార్మికవర్గ పోరాటానికీ, కార్మిక నియంతృత్వానికీ, అనివార్యంగా దారితీస్తుందని చెప్పడంలేదు. అందుకే పబ్లిక్‌సెక్టర్ అంటే సోషలిజం అని అనుకోగలుగుతున్నారు కొందరు అమాయకులు. వర్గపోరాటమంటే భయపడడం రివిజనిజానికి సహజం. అది సామాజిక మార్పును వీలయినంత నిర్జీవంగాను, యాంత్రికంగాను, చిత్రికరిస్తుంది. మనుషులు, వాళ్ళఆచరణ, వర్గపోరాటం, ఆ నిర్జీవమయిన పునాదిపైన యాంత్రికంగా నిర్మితమవుతాయి. సోవియట్ రష్యా నుంచి వెలువడే మార్క్సిస్టు భాష్యగ్రంథాలు అందుచేతనే అంతపేలవంగా ఉంటాయి. వాటిని చదవడం కష్టం, చదివి ఉత్తేజితులు కావడం అసాధ్యం.

"ఇదివరకు భౌతికవాదం ప్రపంచాన్ని తన ఆలోచనకు ఒక బహిర్వస్తువు (object) గా మాత్రమే భావించిందిగాని, ఆచరణగా, సజీవమయిన మానవకృషిగా, భావించలేదు" అని మార్క్స్ అన్నాడు. ఆలోచన కేవలం ప్రపంచాన్ని ప్రతిఫలించేది మాత్రమేకాదు, ఆ ప్రపంచాన్ని మార్చే ఆచరణను ప్రేరేపించేదిగూడ. అది కేవలం ప్రపంచాన్ని ప్రతిఫలించి ఊరుకుంటే, ఆదిమకాలంనుండి ఈనాటి

కాకా ఈ ప్రపంచంలో వచ్చినమార్పులు సంభవించి ఉండేవేకావు. అడవులుపోయి పొలాలు, పొలాలుపోయి కార్ఖానాలు, ప్రకృతిసిద్ధంగారాలేదు. మానవ ఆచరణ ఫలితంగా వచ్చాయి. చైతన్యం ప్రపంచాన్ని ప్రతిఫలిస్తుంది, దానిధర్మాలను అర్థం చేసుకుంటుంది, ఆ అవగాహనను అనుసరించి ప్రపంచాన్ని మారుస్తుంది. ఆ మార్పును సాధించేది ఆచరణ. చైతన్యానికీ నిర్దిష్టమయిన భౌతిక ప్రపంచానికీ మధ్య సంధానంకుదిర్చేది ఆచరణ. "పరిసరాలు మనిషిని రూపొందిస్తాయనీ, కాబట్టి మనిషి మారాలంటే పరిసరాలు మారాలనీ, చెప్పే భౌతికవాదసిద్ధాంతం, ఆ పరిసరాలను మార్చేది మనిషేనన్న విషయాన్ని మరిచిపోయింది" అని మార్క్స్ అన్నాడు. పదార్థమే ప్రధానం, చైతన్యం తద్[illegible]ం. పదార్థం ప్రతిబింబింతప్ప చైతన్యంలో ఏమీఉండదు. అయితే ఆ ప్రతిఫలన యాంత్రికమయినదీ, నిర్జీవమైనదీకాదు, విశ్లేషణాత్మకమయినది, విమర్శనాత్మకమయినది, ఆచరణాత్మకమయినది. నిర్మాణాత్మకమయినది. ఆ ఆచరణ భౌతికమే, ఆ నిర్మాణంభౌతికమే. చైతన్యం పదార్థ ప్రపంచంలో భాగంకాదుగాని. చైతన్యమయిన ఆచరణ పదార్థ ప్రపంచంలోభాగమే.

ఇవి అందరికీ తెలిసినవిషయాలే, కాని పదేపదే చెప్పుకోవలసి వస్తోంది. 'పరిస్థితుల'నుండి మానవ ఆచరణను వేరుచేసి, 'పరిస్థితులు' అనేవి తమంతట తాము పరిపక్వమయిన తరువాతే విప్లవఆచరణ ప్రారంభమవుతుందనే ఆలోచనను రివిజనిస్టులు ప్రచారంచేస్తున్నారు. మెన్షెవిక్కులనుండి ఈనాటి ఆధునిక రివిజనిస్టులవరకు అందరూచేసిన పనే ఇది. భౌతికపరిస్థితులలో మానవ ఆచరణ ఒక భాగమనీ, ఆ పరిస్థితులు పరిపక్వంకావడంలో మానవ ఆచరణ పాత్రవుందనీ, గుర్తించదు రివిజనిజం. సామాజిక-ఆర్థికసంక్షోభం తీవ్రతరం కావడంవల్ల నక్సల్బరీ జరిగిందని అకడెమిక్ మార్క్సిజం గుర్తించిందిగాని, నక్సల్బరీ జరగడంవల్ల ఆ సంక్షోభం మరింత తీవ్రతరమయిందని గుర్తించలేదు.

వైజ్ఞానిక-పారిశ్రామిక రంగంనుండి చక్కటి ఉదాహరణలు దొరుకుతాయి. ఇవ్వాళ రసాయనిక ఎరువులు విస్తృతంగా వాడుతున్నాము. వాటిఅవసరం ఈశతాబ్దం వరకు ఏర్పడలేదు. సారవంతమయిన బీడు భూములు ఖాళీగా పడివున్నంతకాలం ఎరువుల అవసరం ఎక్కువగా ఉండదు, ఉన్నంతమేరకు ప్రకృతిసిద్ధమయిన ఎరువులు సరిపోతాయి. సారవంతమయిన భూములన్నీగూడ (దాదాపుగా) పంటకిందికి వచ్చిన తరువాతే, అంటే ఈశతాబ్దిలోనే, భూసారాన్ని మరింత పెంచే కృత్రిమఎరువులు అవసరం అయ్యాయి. రసాయనిక ఎరువులు కనిపెట్టబడ్డాయి. అయితే ఆ అవసరం తనంతటతాను ఈ ఆవిష్కరణకు దారితీయలేదు. అవసరంవేరు, అవకాశంవేరు. ఆ అవసరం ఆసన్నంకావడానికి గత రెండుమూడు శతాబ్దాల వైజ్ఞానిక-పారిశ్రామిక పరి

కోరిన, ఆచరణ- దోహదం చేసాయి. ఆ ఆచరణే లేకుంటే, కృత్రిమ ఎరువుల అవసరం తనంతటతాను రసాయనిక ఎరువుల ఆవిష్కరణకు దారితీసి ఉండేదికాదు. విస్తృతమయిన క్షామానికి దారితీసి ఉండేది. నిరంతరం మారేప్రపంచాన్ని దాని ధర్మాలకు అనుగుణంగా మారుస్తూ ముందుకుసాగే మానవఆచరణే అవసరాన్ని అవకాశంగానూ వాస్తవంగానూ మారుస్తుంది. ఆశలకూ ఆదర్శాలకూ నిలయమయిన చైతన్యానికీ, నిర్జీవమయిన భౌతికప్రపంచానికీ, సంధానంసాధించేది ఆచరణ. అది సజీవ భౌతికప్రక్రియ.

బోల్షెవిక్ విప్లవం ఈ విషయాన్ని చక్కగా నిరూపించింది. ఇరవయ్యవ శతాబ్దంలో బూర్జువా విప్లవాలు విజయవంతంకాలేవు. కాబట్టి జారిజాన్ని అసంపూర్ణంగా మట్టుబెట్టిన 1917 ఫిబ్రవరి విప్లవం తన కర్తవ్యాన్ని పూరించాలంటే అక్టోబర్ విప్లవం అవసరం అయింది. అయితే మెన్షివిక్కులు బోధించినట్లు ఆ బూర్జువా విప్లవం తనంతటతాను పతనమయ్యేతరుణం పరిపక్వమయ్యేదాకా చేతులుముడుచుకొని కూర్చొని వుంటే రెండవ విప్లవం అక్టోబర్‌లో జరిగివుండేదికాదు, ఆ అవసరాన్ని వాస్తవీకరించింది, ఫిబ్రవరి నుండి అక్టోబర్ వరకు నడిచిన బోల్షెవిక్ ఆచరణ. ఆ ఆచరణ పరిస్థితులను పరిపక్వంచేసే క్రమంలో తన కర్తవ్యాన్ని నిర్వహించకుంటే ఆ క్రమం పరిపూర్ణం అయ్యేదికాదు.

పరిస్థితులను మన ఇష్టంవచ్చినట్టు మనం మార్చుకోగలమనీ, మనకు అనుకూలంగా మలచుకోగలమనీ, నా ఉద్దేశ్యం కాదు. పరిస్థితులు భౌతిక పరిస్థితులను అనుసరించి మారుతాయి. కాని వర్గపోరాటం ఆ భౌతిక సూత్రాలలో ఒకటి. దాన్ని నడిపేది ఆచరణ. క్రియాశీలకమయిన ఆచరణ. భౌతిక పరిస్థితుల స్థాయిని దృష్టిలో ఉంచుకొని వర్గపోరాటం నడవడం ద్వారా ఆ స్థాయిని ముందుకు తీసుకుపోగలుగుతుంది. కరీంనగర్‌లో భూస్వాములకూ రైతులకూ మధ్యఉన్న వైరుధ్యం 'తనంతట తాను' పరిపక్వమయి పోరాటరూపంతీసుకోలేదు. రైతాంగాన్ని సంఘటితపరిచిన విప్లవ ఆచరణ ఆ వైరుధ్యాన్ని బద్దలయ్యే స్థాయికి తెచ్చింది. చైతన్యం భౌతికం కాదు. కాని ఆ చైతన్యంచేపట్టే ఆచరణ భౌతికం. మార్పును సాధించే బాధ్యతను ఆచరణ నిర్జీవమయిన ఇతర భౌతిక పరిస్థితులకు వదిలేయదు. అట్లాగని వాటిస్వరూప సూత్రాలను విస్మరించి దుందుడుకుగా ముందుకుసాగదు. శాస్త్రీయంగా వర్తించి మార్పును సాధించాలి. ఇతర అంశాలను సమన్వయపరచి. భౌతిక ప్రపంచంలో గణనీయమయిన మార్పును సాధించే కీలకమయిన అంశం ఆచరణ. ఈ విషయాన్ని స్పష్టంగా గుర్తించకపోతే రివిజనిజం నుండి మార్క్సిజాన్ని కాపాడుకోలేము.

— కె. బాలగోపాల్